పద్మాపురం పార్కు గేటుదాటి కర్పూరపు చెట్ల మధ్య నుంచి రోడ్డు మీదనడుస్తూ, వంగి దిగువున రాలినఆకు తీసి చిదిమి వాసన చూశాను. కర్పూరపు వాసన అద్భుతం.

తలెత్తి చెట్లవైపు చూశాను. మామిడి చెట్లను పోలి దృఢమైన మానుతో, ఇరువైపులా వరుసదీరి వున్నాయి. నాకు పార్కు చూపించటానికి అంగీకరించిన అతను చెప్పాడు అవి కర్పూరపు చెట్లని.

అక్కడ అగ్రికల్చర్ ఆఫీసరుగారు నాకు పరిచయస్థులు. చాలా కాలంగా అదుకవేటి, పద్మాపురంపార్కు చూడాలనే కోరికవున్న నేను అడుక వచ్చి అతన్ని కోరాను. పార్కులో వున్న చెట్లు నాకెవరన్నా వివరించి చెప్పేలా చూడమని.

అతని ఉద్యోగం నాకు తెలియదు కాని అతని పేరు మాత్రం కేశవరావు. "కేశవరావు మీకు అన్నీ చూపిస్తాడు నేనే వచ్చేవాణ్ణి కాని ఇవ్వాళ విశాఖ వెళ్ళాల్సి వుంది" అన్నారు అగ్రికల్చర్ ఆఫీసరు రామచంద్రరావు గారు.

కేశవరావూ, నేనూ ఒకరి పక్కన ఒకరం ఒకోసారి అతను ముందూ నేను వెనుక, నేను



# కొలిపాటి విజయ
# కొండెక్కిన కర్పూరం



ముందూ అతను వెనుక నడుస్తూ పార్కంతా తిరిగాం.

రకరకాల పూలచెట్లూ, గులాబి మొక్కలూ, మిరియపుతీగలూ, దాల్చిన గంధపుచెట్లు ఇంకా ఎన్నో మనం దిగువన చూడలేని చెట్లు ఆ కొండ మీద లోయలో వున్నాయి.

అది కార్తీక మాసం అవటం వలన పార్కంతా జనంతో నిండి, సందడిగా వుంది. స్త్రీలూ, పురుషులూ, స్టూడెంట్స్ ఎక్కడెక్కడి నుంచో కేరియర్లు తెచ్చుకొని, జట్లు జట్లుగా నునువెచ్చని ఎండనీ, సన్నని వలినీ ఖాతరు చెయ్యకుండా ఆనందంగా మాట్లాడుకుంటూ, ఈలలువేస్తూ, పాటలు పాడుకుంటూ కాలం గడిపేస్తున్నారు. ఆ వాతావరణం ఆహ్లాదకరంగా వుంది. నాకూ సంతోషంగా వుంది.

సీతాఫలం, రామాఫలం కలిపి నాటి పెంచిన చెట్టు తాలూకు కాయ ఒకటిపట్టి చూపిస్తూ "చూడండి ఈ కాయ ఎంత తమాషాగా వుందో" అన్నాడు కేశవరావు.

సీతాఫలంలా చిన్న చిన్న కణుపులు, రామాఫల మంత పెద్ద సైజులోనూ వుంది. ఆ కాయ గమ్మత్తుగా వుంది.

ఇంత శ్రద్ధగా ప్రతిచెట్టూ వివరిస్తూ చెప్తున్న కేశవరావుకి ఏమివ్వాలి? అని ఆలోచిస్తూ అతని కూడా నడుస్తూ అతను చెప్పేది వింటున్నాను.

ఎరుపు, పసుపు కలిసిన మిశ్రమ రంగులో, కవ్వంలా నరుకులతో సన్నగా ఆరడుగుల పొదవులో వున్న పళ్ళు "అరకేజీ కొనండి సార్ బాగుంటాయి" అని కేశవరావు అనటంతో కొని బుజాన తగిలించుకున్న సంచిలో వేసుకున్నాను.

"ఓ పండు తిని చూడండి సార్" అన్నాడు కేశవరావు.

అతను వద్దంటున్నా అతనికో పండిచ్చి నేను ఒక పండు తిన్నాను. ఏమిటో పండు చూపుకే ఆకర్షణ కాని అంత రుచిగాలేదు. అయినా కేశవరావు తృప్తి కోసం "చాలా బాగున్నాయి" అన్నాను.

తిరుగు ముఖం పట్టాం. టైం పన్నెండవుతూంది. మళ్ళీ పొదరిల్లు కర్పూరపుచెట్లు, కర్పూరపు ఆకులు నాలుగు ఏరి సంచీలో వేసుకున్నాను.

నిటారుగా నిల్చుని చుట్టూ కలియజూస్తూ, అక్కడి పట్టు పరిశ్రమ గురించి అతన్ని ప్రశ్నిస్తూ జేబులోంచి ఐదు రూపాయల కాగితం తీసి అతని చేతిలో వుంచబోయాను.

'మీరే ఉంచుకోండి' అని చెయ్యి అడ్డుగా తిప్పి ముఖం పక్కకి తిప్పుకొన్నాడు కేశవరావు. ఆ గొంతు పలికిన తీరులో రవ్వంత రోషం, ముఖం ఎర్రవారినట్లని పించింది.

నొచ్చుకున్నాను డబ్బు ఇవ్వబోయి అతన్ని కించపరచానని.

"మరి వస్తా" అంటూ, ఆ పక్కనే వున్న బిల్డింగు వైపు నడిచాడు కేశవరావు.

'మెనీమెనీ థ్యాంక్సండీ' అన్నాను తడబడింది నా గొంతు.

ఒకడుగు ముందుకి వేశానో లేదో, విస్తరాకుల కట్ట చంకన పెట్టుకుని గబగబ లోపలికి వస్తూ కనిపించాడు కర్పూరం. కాస్త చిక్కి నల్లబడ్డట్టున్నాడు.

'కర్పూరం!' గొంతు పెద్దచేసి పిలిచాను అతని పేరు సత్యన్నారాయణ. అదేం ముద్దుపేరో వాళ్ళ బామ్మ పిలిచేదట కర్పూరం! అని అదే వాడి నామధేయమయి పోయింది.

ఎవరో అన్నట్టు తక్కున వెనుదిరిగి నావైపు చూశాడు కర్పూరం. వెంటనే కనుబొమ్మ లెగరేసి నవ్వుతూ "నువ్వట్రా ఏమిటిలా వచ్చావ్" అన్నాడుకర్పూరం.

"నా మాటకేం ఉత్తనే చూడాలని వచ్చాను రే! నువ్వా?" ఆగాను.

కర్పూరం కొండెక్కి పోయింది. మొండి నవ్వు నవ్వాడు. పాపం జాలేసింది. కళకళలాడుతూ నవ్వుతూ, ఉషారుగా మాట్లాడే కర్పూరం ముఖం కళ తప్పింది. మడత నలగని ఇస్త్రీ పంచలు కట్టి కర్పూరం కాస్త మాసి నలిగిన పంచ కట్టాడు. సిల్కులాల్చీలు వేసి ఠీవిగా తొక్కున నడిచే కర్పూరం లాల్చీ బుజాలపై కుట్లు.

* * *

సరిగ్గా ఆరు నెలల క్రితం కర్పూరాన్ని చూడాలని వాళ్ళ ఊరు వెళ్ళాను. వాడు నేనూ ఎనిమిదవ తరగతి వరకూ కలసి హైఎలిమెంటరీ స్కూల్లో చదువుకున్నాం. కర్పూరం చదువు అక్కడితో ఆగిపోయింది. మా నాన్నగారికి ఆ ఊరి నుంచి ట్రాన్స్ఫరయి అప్పటికి ఇంగ్లీషు కూడా ప్రయివేటుగా చదివి వుంజుకున్న నేను హైస్కూలులో చేరటం జరిగింది.

ఓ రోజు "కర్పూరం చదువు ఆపేసేడు ఏం చేస్తాడట" అని నేనంటే మా దొడ్డమ్మ అందుకొంది. "వాడికేంరా నిక్షేపంలా తండ్రి కరిణీకముంటేనూ, బోల్డు రాబడి. మా రోజుల్లో అనేవారు కలెక్టరుద్యోగమూ, కరిణీకమూ ఒకటని. వాడికేం రారాజులా బతికేస్తాడూ" అని వాడి దగ్గర నేను తీసికట్టవుతానన్నట్లు.

"ఆ మాత్రం ఉద్యోగం నాకూ వస్తుందిలే" అన్నాను రోషంగా.

కాని కథ యిలా అడ్డం తిరుగుతుందని తరతరాలుగా వస్తూన్న కరిణీకాలు గొడ్డలి పెట్టుకు కూలిపోతాయని, చెట్టూ, పుట్టాపట్టి జోలెపట్టి కరణాలు దిక్కుమాలిన పక్షులై గింజలేరుకుని తినే రోజులు వస్తున్నాయని దొడ్డమ్మ ఊహించి వుండదు.

నన్ను ఆ రోజు సాదరంగా "రా రా! చాలా రోజుల తర్వాత చూశాను!" ఆహ్వానించాడు కర్పూరం. వాడి భార్య నమస్కారం చేసింది.

ఉద్యోగంలేని పేదరికం వాడింట్లో వాడి భార్యలో, పిల్లల్లో కొట్టొచ్చినట్లు కనిపిస్తూంది.

"ఓసారి వచ్చి చూడాలని చాలా సార్లనుకున్నానురా, కాని సెలవు దొరకలేదు" అన్నాను వీధి వరండాలో వున్న చెక్క బెంచీ మీద కూర్చుంటూ.

"పోన్లె అభిమానముంది కనుక వచ్చావు" అని లోపలికి వెళ్ళాడు.

నాకు భోజనం ఏర్పాట్లు చెయ్యటానికి కాబోలు.

చుట్టూ పరుచుకున్నాయి నా చూపులు. వాడి తాటాకుల మిద్దె ఇంటికి కళ తప్పింది. గోడలు మాసి వున్నాయి. ఇల్లు నేయించి ఎన్నేళ్ళయిందో పాపం అనుకున్నానోసారి జాలిగా. వాడి

తాతలనాటి ఆస్తులన్నీ తండ్రి వ్యసనాలకి కరిగి పోయాయి. వాడికి మిద్దెఇల్లు, కరిణీకమూ మాత్రమే మిగిలాయి. బుర్రా, నోరు, కాస్తంత తెలివీ వున్నవాడు కనుక కర్పూరం కరిణీకంతో కాల క్షేపం, దర్జాగానే చేసేవాడు. కరిణీకం కాకెత్తుకు పోయింది. కర్పూరం సంసారం గుట్టు రచ్చకెక్క కుండా, పిల్లలు రోడ్డున పడకుండా జాగ్రత్త పడుతూన్నట్లున్నాడు.

"ఆ ఏమిట్రా కబుర్లు" అంటూ నెమ్మదిగా బయటకు వచ్చాడు కర్పూరం.

"ఏముంటాయి కబుర్లు? ఉద్యోగం, భార్య, పిల్లలు, ఇల్లు, సంసారం "గానుగెద్దు జీవితం ఏముంది?" నవ్వబోయాను.

"ఏరా మనం చదువుకునే రోజులు, ఆ బాల్య జీవితమే బాగుండేది కదూ! బంగళా అరుగుల మీద మన బాతాఖానీ, మర్రిచెట్ల క్రింద గోళీ లాటలు, చెడుగుడు ఆటలు, ఏరా తల్చుకుంటే మనసు హాయిగా వుంటుంది కదూ!'' అడిగాడు.

"అందరికీ బాల్యజీవితమే హాయిగా వుంటుంది. ఆ జ్ఞాపకాలే తియ్యగా వుంటాయి" అన్నాను. వాడు మళ్ళీ లోపలికి వెళ్ళి కాఫీ గ్లాసుతో తిరిగి వచ్చాడు.

"ఒక్క పది నిమిషాలు అలా వెళ్ళి వస్తాను కూర్చుంటావు కదూ!'' అన్నాడు కాఫీ గ్లాసున్న చెయ్యి నా ముందుకి చాపుతూ.

"వద్దు. ఇప్పుడేమిటి కాఫీ!'' అనకుండానే కాఫీ తీసుకున్నాను. ఊ కొడుతూ కాఫీ వద్దంటె ఇప్పుడెక్కడికి వెళతావ్, నేనూ వస్తాను. ఇందులో ఏ మాటన్నా కర్పూరం బాధపడతాడని, ఇబ్బంది పడతాడని భయమే.

గబగబ పంచదూరి వాకిట్లోకి నడిచాడు కర్పూరం.

కాఫీ చల్లగా, చప్పగా వుంది. కాఫీలోనే వాడి ఇంటి పరిస్థితి తెలిసి పోయింది. వాడింట్లో గతంలో వాడు ఉద్యోగంలో వుండే రోజుల్లో చిక్కని ఫిల్టరు డికాక్షనుతో, గేదె పాల కాఫీ తాగాను.

భోజనాల వేళకి వచ్చి వాడిని ఇబ్బందికి గురి చేసేనేమో: మథనపడుతూ కూర్చున్నాను.

* * *

"ఇంకో చెంచా నూనెయ్యమ్మా!'' అంది ఐదేళ్ళ పిల్ల అన్నం దగ్గర మారం.

ఆ సంభాషణ వినాలని అనిపించక పోయినా, నా చెవులు వింటున్నాయి.

"తినెయ్యాలమ్మా! ఇవాల్టికి" తల్లి గారా విస్తోంది.

"మరి రేపు. రెండు చెంచాలేస్తావా?"

"ఊఁ"

"పోలిసెట్టి ఇవ్వాళ ఏమీ అరువివ్వనన్నా డుగా"

"ఉష్. మళ్ళీ నాన్నగారికి ఉద్యోగం వస్తుంది. అప్పుడు నువ్వు అడిగినవన్నీ''

"హాయ్ హాయ్ నాన్నగారికి ఉద్యోగ మొస్తుంది'' అని చప్పట్లు "అందుకే తొందరగా తినెయ్. బంగారు తల్లి కదూ!''

"సూరిగాడి వంతునూనె నాకేసెయ్. నాన్న గారి ఉద్యోగం వచ్చాక నేను అప్పుతీర్చేస్తాను.'' గడుసు పిండం, జాలిగా నవ్వుకున్నాను.

"అబ్బా! తింటావేం?'' ఏడేళ్ళ అబ్బాయి అంటున్నాడు.

"ఉష్ నెమ్మది. అవతల మామయ్య గారు వింటారు.'' ఆమె అంటూంది అతి నెమ్మదిగా.

"మామయ్యగారు వచ్చారు ఏం చేస్తావమ్మా! పరమాన్నమా!'' వాడి కన్నా పెద్దపిల్ల ప్రశ్న.

"మాట్లాడవద్దన్నానా?'' ఆమె గద్దింపు.

"అమ్మా ఇవ్వాళ కూర ఎన్నేసి ముక్కలమ్మా వంతుకి?'' ఇంకో అమ్మాయి ప్రశ్న.

"రెండేసి'' ఆమె జవాబు.

"మామయ్య గారికి వుంచేశావా కూర?''

"వెధవ ప్రశ్నలు వెయ్యక గప్‌చిప్‌గా తినెయ్యండి. మామయ్య గారుండగా మీరిలా మాట్లాడే రని తెలిస్తే నాన్నగారు ఒక్కొక్కరికీ డొక్క చీరేస్తారు'' అని బెదిరిస్తూందామె.

అందరికన్నా పెద్దవాడు నెమ్మదిగా అడుగుతున్నాడు అమ్మని. "కొద్దిగా మజ్జిగ పొయ్యమ్మా! వేడిచేసి రక్తం పడుతూంది" అని దీనంగా:

"ఉంటె పొయ్యనూ బాబూ! ఇవాల్టికి తినెయ్'' ఈసారి ఆమె గొంతు జలుబు చేసినట్లు ధ్వనించింది.

"రోజూ తరవాణ్ని నీళ్ళేనా? పోనీ కొంచెం పంచదార వెయ్యి''

"నిండుకుంది బాబూ!''

మరి అక్కడ కూర్చోలేకపోయాను. లేచి రామ కోవెల వైపు నడిచాను.

స్టుపిడ్. కర్పూరానికి బుద్ధిలేదు. తానెన్ని సార్లు చెప్పాడు? "కుటుంబ నియంత్రణ గురించి ఆలోచించు. ఇహ పిల్లలు వద్దు, నీవు పోషించ లేవు నీ ఉద్యోగ మేపాటిది? నీకు వచ్చే ఆదాయ మెంత?'' అని మందలించాడు కూడా.

"అమ్మ ఒప్పుకోదురా'' అన్నాడు.


"నాన్‌సెన్స్ సాకులు చెప్పకు నీ పిల్లల్ని మీ అమ్మ పోషిస్తుందా? నువ్వా'' అని అడిగాను చనువుగా. అయినా కర్పూరం లక్ష్య పెట్టలేదు ఏడుగురు పిల్లల తండ్రి అయిపోయాడు.

ఇప్పటి పరిస్థితి? నాకు జాలి కోపం రెండూ కదిలాయి మనసులో, రామకోవెల ఎదుట రావిచెట్టు దాని చుట్టూ సిమ్మెంటుదిమ్మ ఆ దిమ్మ సాయంత్రం అయ్యేసరికి రచ్చబండ అయ్యేది. ఇదివరకు రైతులు చుట్టలు కాలుస్తూ వాళ్ళకితోచిన మాటా మంతితో కాలక్షేపం చేసేవారు. ఊరు చాలా

**తగిన ధర్మం**

"అమ్మగారూ! పక్కింటి ధర్మాత్మురాలు, మహాతల్లి కడుపు నిండా భోజనం పెట్టారండీ! మీరు కూడా ఏమయినా ధర్మం చేయండమ్మా!''

"అయితే నేను వాంతులవకుండా టాబ్‌లెట్టిస్తాన్లే!''



మారింది. కొత్తఇళ్ళులేచాయి హైస్కూలువచ్చింది ఊళ్ళోకి బస్సు వస్తూంది. ఊరు కళ కల లాడు తూంది కాని కర్పూరం జీవితం మాత్రం కళ తప్పింది వెల వెలా పోతూంది.

కాస్సేపు అటూ ఇటూ ఊర్లో తిరిగి, రెండు డజన్లు అరటిపళ్ళు కొని కర్పూరం ఇంటివైపు నడిచాను.

''ఎటుపోయావురా కూర్చో మంచేనూ, ఇవన్నీ ఎందుకురా బాద స్తంకాని'' అన్నాడు నా చేతిలో ఉన్న అరటిపళ్ళవైపు మొహమాటంగా చూస్తూ!

''ఉత్తనే ఊరుచూడాలని అలా వెళ్ళాను, పిల్లలకివ్వు'' అని అరటిపళ్ళు బల్ల మీద ఉంచాను. ''లే భోం చేద్దాం'' అన్నాడు కర్పూరం.

తప్పదు ఏమంటే వాడిమనస్సు నొచ్చుకుంటుందో అని కాళ్ళు కడుక్కొని నట్టింట్లో పీట మీద కర్పూరం ప్రక్కన కూర్చున్నాను.

వేడివేడిగా అన్నం 'పలుచగా టమాట పప్పు' వంకాయ ముద్దకూర పలచని మజ్జిగా, నేనుతెచ్చినదే అరటిపండు. గబగబా తిని లేచాను. ఇది వరకు నేను వచ్చానంటే కూరా సాంబారు అప్పడాలు పెరుగేకాక పిండివంటతో విందుచేసేవాడు కర్పూరం. కరణాల జీవితాల్లో విధి మసి గీత గీసింది.

''ఏదో పేదవాడి అతిథ్యం'' అన్నాడు కర్పూరం నా తడి చేతులు తుడుచుకోవటానికి తువ్వాలందిస్తూ.

తర్వాత పది నిమిషాలు మాట్లాడి, బస్ టైమవటంవలన ''వస్తారా! మళ్ళీ వచ్చి కలుస్తాను. ధైర్యంగా ఉండు గుండె చెదరనీకు. బెంగపడి ఆరోగ్యం పాడుచేసుకోకు. జీవితం అన్నాక ఏవో ఒడుదుడుకులు వస్తూంటాయి.'' అని సానుభూతిగా ఓదార్పుగా వాడి బుజంతట్టి వాడు వారిస్తున్నా వినకుండా, వాడి చిన్న కొడుకుచేతిలో పాతిక రూపాయలుంచి, బయలుదేరాను.

బస్సెక్కే వరకూ నా కూడా వున్నాడు కర్పూరం.

మళ్ళీ అనాటికి నాడు కర్పూరాన్ని చూడటం

* * *

''కర్పూరం కొండెక్కట మేమిట్రా! పిల్లలు అంతాబాగున్నారా! నువ్వుబాగాపాడయిపోయావే!'' అన్నాను నఖశిఖ పర్యంతంవాడివైపు పరిశీలనగా చూస్తూ.

''బాగున్నాంలే. ఉన్న ఊరు వదిలి పోవటం ఒక్కో సందర్భంలో బాగుంటుంది కదూ!'' అని నవ్వి ''ఇక్కడ నన్ను తెలిసిన వాళ్ళెవ్వరూ లేరు. ఏ పని చేసి ఎలా బ్రతకినా పట్టించుకునే వాళ్ళు లేరు. ఇక్కడందరూ సత్యన్నారాయణ అనే పిలుస్తారు. మీరు అనే సంబోధన ఆ ఊర్లోనే వుండిపోయింది. ఉంటావా, వెళ్ళి పోతున్నావా?'' అన్నాడు కర్పూరం గబగబ.

''వెళ్ళిపోతున్నాను. ఆ విస్తరాకులేవిటి? పిక్‌నిక్ వేసుకున్నారేవిటి?'' అడిగాను.

''ఆ పిక్‌నిక్కే మా వాళ్ళు ఏదో సాయం చెయ్యటానికి వచ్చారులే. వెళ్తాను మరి. ఈ పాటికే అలస్యమైందని మా కంట్రాక్టరు చెడామడా తిడుతూ వుంటాడు'' అని ముందుకు నడవబోయాడు కర్పూరం.

''కంట్రాక్టరు కథేమిట్రా అస్సలు. ఏం చేస్తున్నావ్ చెప్పేయ్'' అంటూ వాడి చెయ్యి పట్టి ఆపాను.

''ఓ కంట్రాక్టరు దగ్గరపనికి కుదిరాను. భుక్తి గడవాలిగా'' నవ్వాడు విరక్తిగా.

''పనంటే'' వాడి చెయ్యి వదలకుండానే ప్రశ్నించాను.

''ఏ పని చెబితే అది!'' అని నా చేతిని నెమ్మదిగా విడిపించుకుని మళ్ళీ వెళ్ళబోయాడు

మళ్ళీ వాడి చెయ్యిపట్టి ఆపుతూ ''అడ్రసివ్వు నీకు మూడు, నాలుగు ఉత్తరాలు వ్రాశాను. జవాబులేదు ఇదన్నమాట. ఊరు మారిపోయావు. పోనీ ఓసారి మీ ఇంటికి వెళ్ళాలనుకున్నా. తీరిక చిక్కలేదు'' అన్నాను.

వాడు అడ్రసు చెప్పాడు, జేబులోంచి పెన్నూ సిగరెట్ పెట్టి తీసి సిగరెట్ పెట్టి అట్టమీద అడ్రస్ రాసుకున్నాను.

''వస్తాన్రా'' అని పార్కులోకి చంకనున్న విస్తర్లకట్ట సవరించుకుంటూ వెళ్ళి పోయాడు కర్పూరం.

జాలిగా చూశాను వాడివైపు.

తర్వాత వాడిచ్చిన అడ్రసు ప్రకారం వాడుంటున్న ఇంటికి వెళ్ళాను.

చిన్నగడ్డిపాక. చెక్కల తలుపు తాళం పెట్టి, వుంది, బయట మట్టి గొలెంతో నీళ్ళు. అంతా పిక్‌నిక్ పోయినట్లున్నారు అనుకుంటూ స్టాండు వైపు నడిచాను.

కర్పూరపు ఆకు చిదిమి వాసన చూశాను.

కర్పూరం కొండెక్కింది. అంటె కర్పూర హారతి కొండెక్కింది! విధిని నిందించాను నిస్సహాయంగా.

కర్పూరానికి ప్రతి నెలా ఏదో కొంత సాయం చెయ్యాలి అనుకున్నాను ఆవేశంగా.

కాని నా ఆర్థిక పరిస్థితులు గుర్తొచ్చి నవ్వుకున్నాను. *